## క్లుప్తంగా

### సాయిరాజ్ పరామర్శ



చిట్టిబాబు కుటుంబాన్ని పరామర్శించిన సాయిరాజ్ తదితరులు

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గ జేసీఎస్ బూత్ కన్వీనర్, కమలాయిపుట్టుగ గ్రామానికి చెందిన రాంపత్ని చిట్టిబాబు తండ్రి రామ్మూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో చిట్టబాబు కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ శుక్రవారం పరామర్శించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శలో కవిటి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్, రజనీకుమార్‌దొళాయి, దేవరాజ్ సాహూ, మండల యూత్ కన్వీనర్ ఎన్ని అశోక్ ఉన్నారు.

### స్లాబ్‌ను ఎంచుకునే అవకాశం ఇవ్వాలి

టెక్కలి: మైనింగ్ పర్మిట్లు విషయంలో స్లాబ్‌ను ఎంచుకునే విధంగా అవకాశం ఇవ్వాలని గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ ప్రతినిధులు గోపి, నవీన్‌చౌదరి, మహేంద్రసింగ్, లోకేష్ కోరారు. శుక్రవారం టెక్కలి విశ్వ సముద్ర కార్యాలయంలో సంస్థ ప్రతినిధులు చక్రవర్తి, సునీల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం కట్టర్ సైజు బ్లాకులపై 25 శాతం రాయితీ ఇవ్వాలని, బ్లాకులను తక్కువ మూలాల నుంచి కొలతలు వేయాలని, స్లాబ్ వాహనాలను ఆపి తనిఖీలు చేయకూడదని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

### వైఎస్ వర్ధంతి రోజున సామాజిక కార్యక్రమాలు

టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా వచ్చేనెల రెండో తేదీన నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో ఉన్నటువంటి వైఎస్ విగ్రహాల వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు టెక్కలిలోనివైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకోవాలని తిలక్ పిలుపునిచ్చారు. ఇక్కడ వైఎస్ విగ్రహానికి నివాళులర్పించిన తరువాత వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఎరువులు కృత్రిమ కొరత

టెక్కలి: ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని.. తక్షణమే స్పందించి ఎరువులు అందజేయాలని రైతులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి తహసీల్దారు దిలీప్ చక్రవర్తికి విన్నవించారు. యూరియా కావాలంటే ఇతర మందులు కొనుగోలు చేయాలని కొర్రీలు వేస్తున్నారని వాపోయారు. ఎరువుల డీలర్లు వారికి ఇష్టమైన ఎరువులను రైతులకు అంటగడుతున్నారని దీని వలన అత్యధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఎస్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, జి.నారాయణరావు, టి.తవిటయ్య, కై లాస్, గవరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిద్రపోతున్న నిఘా నేత్రాలు!

● డివిజన్ కేంద్రం టెక్కలిలో పనిచేయని సీసీ కెమెరాలు





ప్రదాన కూడలిలో పనిచేయని సీసీ కెమెరా (ఇన్‌సెట్లో) పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మోనిటర్‌లో కనిపించని సీసీ ఫుటేజ్‌లు

టెక్కలి రూరల్:

సీసీ కెమెరా. ఇప్పుడు ఎక్కడ విన్నా ఇదేమాట. ఎక్కడ చూసినా ఇవి కనిపిస్తాయి. చోరీలు జరగకుండా, ప్రమాదాల సంభవించే సమయంలో ఆధారాల కోసం వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏదైనా సంఘటన జరిగే సమయంలో పోలీసుల విచారణ కోసం సీసీ కెమెరాల పుటేజీలు కీలక ఆధారంగా మారుతున్నాయి. అంతటి ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాలను డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పలు చోట్ల పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులుగా అవి పని చేయకుండా నిద్రపోతున్నాయి. దీంతో ఏదైనా సంఘటన జరిగితే గుర్తించలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల టెక్కలి పరిసర ప్రాంతాల్లోని పలు ఇళ్లు, దుకాణాల్లో చోరీలు జరిగాయి. అయితే చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సైతం పోలీసులు ఏర్పాటు చేసిన కెమెరాలు పనిచేయక పోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో సమీప ప్రాంతాలలోని దుకాణాలు, ఇళ్లల్లో ఉండే కెమెరాపై ఆధారపడాల్సిన పరిస్థితి పోలీసు సిబ్బందికి ఏర్పడింది. టెక్కలి పట్టణ పరిధిలో 20కి పైగా సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేశారు. అయితే ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే అందులో సగానికి పైగా పని చేయకుండా పోయాయి. దీంతో ఎక్కడ ఏమిజరుగుతుందో తెలుసుకునే వీలు లేకుండా పోయింది. ఇటీవల టెక్కలిలోని నాలుగు రోడ్లు జంక్షన్ వద్ద ఒక వ్యాన్‌లో బ్యాటరీ చోరీకి గురైంది. దీంతో సంబంధిత వ్యక్తి పోలీసుల వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సీసీ కెమెరాను పరిశీలించాలని కోరారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా పని చేయడం లేదని పోలీసులు చెప్పడంతో వ్యాన్ యజమాని ఆశ్చర్యపోయాడు. ఇది కేవలం ఉదాహరణ మాత్రమే. ఇటీవల ఇలాంటి సంఘటనలు చాలా చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా పోలీసులు అధికారులు స్పందించి ఎంతో ప్రాధాన్యం ఉన్న సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఆదివాసీ సదస్సును విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సదస్సును విజయవంతం చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం సదస్సుకు చెందిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో తేదీన నెల్లూరులో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సదస్సు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకుడు దానేసు, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకుడు వీరాస్వామి, లక్ష్మణ, గంగయ్య, బాలరాజు, పిండి వెంకటరావు, చిరంజీవి, నాగమణి, వినోద్, జోగి కోదండరావు, వీరాస్వామి పాల్గొన్నారు.

# మౌలిక సౌకర్యాల కల్పనకు వినతి



నందిగాం: హర్షబడలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజారావు

కంచిలి: గిరిజన గూడల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో ఆధ్వర్యంలో గిరిజనులు అధికారులకు విన్నవించారు. నువాగడ గ్రామంలో మండల పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పీఎం జన్‌మన్ గ్రామసభలో పంచాయతీ పరిధిలో గిరిజనులు పాల్గొన్నారు. ఎంపీడీవో వి.నీరజ, ఎంఈఓ -1 ఎస్.శివరాంప్రసాద్, పంచాయతీ సెక్రటరీ సర్వేశ్వరరావు ఉన్నారు.

**గిరిజనుల అభివృద్ధే ధ్యేయం**

నందిగాం: గిరిజనుల అభివృద్ధేధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు రూపొందించి అమలు చేస్తుందని ఎంపీడీఓ టి.రాజారావు అన్నారు. హర్షబడ పంచాయతీలోని గిరిజన గ్రామాలైన పెద్ద గురువూరు, చిన్న గురువూరు, సాగరంపేట, వెంకటాపురం, ముకుందాపురం, సవరలింగపురం, మలియాలింగుపురంలలో జన్‌మన్-2లో భాగంగా ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించేలా గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్ మలియా కృష్ణారావు, ఆర్ఐ కిరణ్, ఏపీఎం జాంభవతి పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్, చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కొత్తగా వచ్చిన రెండు వాటర్ ట్యాంకర్లను ప్రారంభించారు. నాలుగో వార్డులో రూ. 16 లక్షలతో సీసీ డ్రైనేజ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వైస్ చైర్‌పర్సన్‌లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి,మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వార్డు కౌన్సిలర్ జి.శేఖర్, దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, టీడీపీ నాయకులు కాళ్ల ధర్మారావు పాల్గొన్నారు.

## నృత్య పోటీలకు కళాకారులకు ఆహ్వానం

కాశీబుగ్గ: సెప్టెంబర్ ఒకటో తేదీన కాశీలో జరగనున్న ప్రపంచ కూచిపూడి నృత్య పోటీలకు మందస మండలం హరిపురం కళాకారులకు ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని నాట్యగురువు నారాయణశెట్టి శైలజ శుక్రవారం తెలిపారు. కూచిపూడి కళాకారులు త్రయంతి, మోక్ష, జాహ్నవి, విమల, గీత బృందం వారణాశి బయలుదేరి వెళ్లినట్టు పేర్కొన్నారు.

## మాజీ మంత్రి పరామర్శ

కాశీబుగ్గ: మందస మండలం పరిధిలో ఉన్నటువంటి పలు గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శుక్రవారం పరామర్శించారు. తంగరపుట్టి, వీ.జీ.పురం, భైరి సారంగిపురం గ్రామాలలో పర్యటించి మృతులకు నివాళిలు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు అగ్గున సూర్యం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

# అధైర్య పడవద్దు అండగా ఉంటాం

● వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

కొటబొమ్మాళి: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని పార్టీ అన్ని వేళల అండగా ఉంటుందని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ భరోసా ఇచ్చారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామ పంచాయతీ సర్పంచ్ గొండు చాందిని, ఆమె భర్త మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ పీఏ గొండు మురళీ కుటుంభాన్ని తిలక్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల దంత గ్రామంలో స్కూల్ కమిటీ ఎన్నిక, ఉపాధిహామీ సామాజిక తనిఖీ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయుల మధ్య ఘర్షణలు జరిగాయి. దీంతో ఇరువర్గాలపై పోలీసు కేసులు నమోదయ్యాయి. సామాజిక పింఛన్లపై కూడా టీడీపీ వర్గీయులు ఫిర్యాదులు చేయడంతో డీఆర్‌డీఏ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో తిలక్ దంత గ్రామానికి వెళ్లి పార్టీ నాయకులతో చర్చించి వివరాలు సేకరించారు. టీడీపీ వర్గీయుల అరాచకాలను సమిష్టిగా ఎదుర్కొని తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు, నందాగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, రోణంకి ఉమ, నాయకులు సంపతిరావు హేమసుందరాజు, అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, మెండ తాతయ్య, కాల్ల సంజీవరావు, దుక్క రామక్రిష్ణారెడ్డి, పేడాడ వెంకటరావు ఉన్నారు.

## వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని సానుకూలంగా స్పందించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలు, సముద్ర తీరం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. స్థానిక ఎస్ఐ సీహెచ్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

# చివరి మజిలీకీ కష్టమే..



పంట పొలంలో నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

నందిగాం/కాశీబుగ్గ: ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా ప్రజలను సమస్యలు వేధిస్తూనే ఉంటున్నాయి. శ్మశాన వాటికలకు సరైన రోడ్లు లేక ఎవరైన చనిపోతే చివరి మజిలీకి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు అవస్థలు ఎదొ్కంటున్నారు. ఇలాంటి సమస్యే నందిగాం మండలం పాత్రునివలస గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఓ ముస్లిం వ్యక్తి కన్నుమూశారు. అతన్ని సమాధి చేయడానికి కాబరస్థాన్‌కి చేరుకోవడానికి కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడ్డారు. జాతీయ రహదారిని దాటి వరి పొలాల మధ్యలో నుంచి మృతదేహాన్ని తీసుకొని వెళ్లి కార్యక్రమాలను పూర్తి చేశారు.

# పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



కోటబొమ్మాళి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోటబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత పింఛన్ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు యూటీఎఫ్ కన్వీనర్ గొండు నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం కోటబొమ్మాళి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.మధుకు వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ నాయకులు సంజీవరావు, వై.వాసుదేవరావు పాల్గొన్నారు.

సోంపేట: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24వ తేదీ తీసుకువచ్చిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, సోంపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొరబాబు, కూర్మారావు, కంచిలి అధ్యక్ష, కార్యదర్శులు మురలి నాయక్, రవికుమార్ పాల్గొన్నారు.

**ఓపీఎస్ విధానమే కావాలి**

టెక్కలి: ఓపీఎస్ విధానమే కావాలని డిమాండ్ చేస్తూ టెక్కలిలో ఉపాధ్యాయ సంఘాలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తహసీల్దారు దిలీప్ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.దాలయ్య, పి.వైకుంఠరావు, పి.గణపతిరావు, వై.గణపతిరావు, కె.కుమారస్వామి, డి.గణపతిరావు, ధర్మారావు పాల్గొన్నారు.

# రైతులను అవస్థలకు గురి చేస్తున్నారు

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని టెక్కలి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా ఎరువులు, విత్తనాలు దొరికేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు అందక రైతులు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. టెక్కలి పరిధిలో పీఏసీఎస్ సొసైటీల నుంచి ఎరువులు అందజేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఎరువులు సరఫరా చేయకపోవడంతో ప్రైవేట్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.

## కౌన్సిల్ సభ్యులకు జీతాలేవీ?

● మున్సిపల్ సమావేశంలో సభ్యులు



భవానీశంకర్ మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న సభ్యులు

కాశీబుగ్గ: అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు గౌరవ వేతనాలు అందడం లేదని 23వ వార్డు కౌన్సిలర్ వజ్జ బాబూరావు అన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరవుతున్నప్పుడు వారిని గౌరవించి వారికి అందాల్సిన గౌవరవేతనం అందించాలని కోరారు. మరో కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు అందడం లేదని గత సభలో చర్చిస్తే పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తన డైరీలో రాసుకున్నారని.. అయితే ఇంతవరకు జీతాలు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 27వ వార్డులో పవర్ బోరు వేయడానికి చైర్మన్, కౌన్సిలర్, అధికారులకు సమాచారం లేకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 17వ వార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్సులో అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నవారికి వెసులుబాటు కల్పించాలని, అద్దె తగ్గించాలని కోరారు.

వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ.. నాలుగో వార్డులో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని, అభివృద్ధి చేయడం లేదన్నారు. సమావేశానికి ముందుగా ఇటీవల మరణించిన కౌన్సిలర్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ మృతుకి సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు ఉన్నారు.

## స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి వివిధ స్కానింగ్ ఆర్డీవో భరత్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ప్రైవేటు ఆస్పత్రులో ఉన్నే స్కానింగ్ మిషన్‌లు, రికార్డులు పరిశీలించారు. ఫారం అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్ అనుమతి, రిజిస్ట్రేషన్ పత్రాలు, చెక్‌లిస్ట్ తనిఖీ చేశారు. కాశీబుగ్గ ఎస్ఐ రేవతి ఉన్నారు. తనిఖీలకు ముందు ఆర్డీవో కార్యాలయంలో అధి కారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

## నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.



కంచిలి: మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి



కోటబొమ్మాళి: సుబ్బారావుపేటలో మొక్కలు నాటుతున్న మంత్రి అచ్చెన్నాయుడు



కవిటి: కొత్తపుట్టుగలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

# మొక్కలతో మానవ మనుగడ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని వక్తలు అన్నారు. మానవ మనుగడ సైతం మొక్కలతోనే ముడిపడి ఉందన్నారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని చెప్పారు. 'వనం-మనం'కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పీహెచ్‌సీలు తదితర చోట్ల వివిధ రకాల మొక్కలను నాటారు. వీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములయ్యారు.



ఇచ్ఛాపురం: గాంధీపార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అశోక్, చెర్‌పర్సన్ రాజలక్ష్మి



సోంపేట: మొక్కలు నాటుతున్న ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ అప్పలస్వామి



కాశీబుగ్గ: మందసలో మొక్క నాటుతున్న ఎంపీడీవో తిరుమలరావు



టెక్కలి: సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో సుదర్శన్ దొర



కాశీబుగ్గ ఎంపీయూపీ స్కూల్‌లో మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు



నందిగాం: గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న అధికారులు



కాశీబుగ్గ: పలాసలో మొక్క నాటుతున్న ఆర్డీవో భరత్‌నాయక్



ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సంతోష్, వైద్యులు



సంతబొమ్మాళి: లక్ష్మీపురంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు